జీపీలకు పక్కా భవనాలేవి?

- ఏడు జీపీలకు భవనాలు మంజూరు
- ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో పెసరికుంట గ్రామ పంచాయతీ కార్యాలయం

దహెగాం: పాలన సౌలభ్యం కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే పంచాయతీలను ఏర్పాటు చేశారు కానీ పక్కా భవనాలు లేక పోవడంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ఏడాది పక్కా భవనాలను మంజూరు చేసింది ప్రభుత్వం. దీంతో పక్కా భవనాల నిర్మాణాలకు మాత్రం స్థలాలు దొరకడం లేదు. స్థలాలను గుర్తించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థలాలు గుర్తించిన చోట పనులు ప్రారంభించ లేదు. పంచాయతీలకు పక్కా భవనాలేవి అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

24 గ్రామ పంచాయతీలు..

మండలంలోని 24 గ్రామ పంచాయతీలున్నాయి. కొత్త మండలాలు ఏర్పడిన తరువాత కొన్ని గ్రామ పంచాయతీలు ఇతర మండలాల్లోకి వెళ్లాయి. నూతనంగా మండలంలో దిగిడ, కర్జి, గెర్రె, కమ్మర్‌పల్లి, చౌక, పీపీరావు కాలనీ, బామానగర్, కల్వాడ, పెసరికుంట, బొర్లకుంట , పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. పక్కా భవనాలు లేక పోవడంతో పాఠశాలల్లో, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

స్థలాల గుర్తింపులో ఆలస్యం..

మండలంలోని చౌక, కమ్మర్‌పల్లి, గెర్రె, పెసరికుంట, బామానగర్, చినరాస్పెల్లి గ్రామ పంచాయతీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో భవన నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు అయ్యాయి. దిగిడ గ్రామ పంచాయతీకి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయి. బామానగర్‌లో పనులు స్లాబ్ వరకు వచ్చి నిలిచిపోయాయి. బిల్లులు రాక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. మిగతా గ్రామాల్లో ఇంకా మొదలు పెట్టలేదు. చౌక, చినరాస్పెల్లి, గెర్రె ,కమ్మర్‌పల్లి, పెసరికుంట పంచాయతీలలో స్థలాలను గుర్తించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కానీ స్థలాలు గుర్తిస్తే పనులు ఎందుకు ప్రారంభించలేదని పలువురు వాపోతున్నారు. దిగిడ గ్రామంలో అటవీ అధికారులు స్థలం ఇవ్వడానికి అడ్డు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు సంవత్సరాలు సర్పంచుల పదవి కాలం ముగిసింది. అయినా.. పక్కా భవనాలు మాత్రం పూర్తి కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ పంచాతీలకు పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఎమ్మెల్సీ వైఖరి మార్చుకోవాలి’



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్ రూరల్: ఎమ్మెల్సీ దండె విఠల్ తన వైఖరి మార్చుకోవాలని సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో భూదందాలు, ఇసుక దందాలు, దోనెంబర్ దందాలు చేస్తున్న వారిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీల్లో కొనసాగిన వారితో కాంగ్రెస్ పార్టీలో ఆధిపత్యం చలాయిస్తామంటే తమ కార్యకర్తలు చూస్తే ఊరుకోరని హెచ్చరించారు. కాంగ్రెస్ వర్గపోరుపై కార్యకర్తలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనకు మర్యాద ఇవ్వకపోయినా.. దళితుడైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్యకైనా మర్యాద ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సిద్దాల దేవయ్య, వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, ఎస్సీ సెల్‌రాష్ట్ర కన్వీనర్ రత్నం శ్రీకాంత్, కస్తూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

కౌటాల: సక్రమంగా పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమశాఖ అధికారి డి.భాస్కర్ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కౌటాల మండలం కన్నెపల్లిలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు నిత్యం వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆహారంలో పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం సీమంతం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో విజయలక్ష్మి, ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ప్రోగాం అధికారులు గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు షకీరా, పద్మ, హసీనా, కరుణ, కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: ఆదివాసీ కొలవార్ మన్నేవార్ సేవా సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని బెజ్జూర్ మండల ఆదివాసీ కొలవార్ మనేవార్ సేవా సంఘం నాయకులు కోరారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్సీకు ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హర్షద్ హుసేన్ కొండ్ర జగ్గా గౌడ్, నాహీర్ అలీ, రాజన సురేశ్, పెద్దల శంకర్, మనేపెల్లి మల్లేశ్, లక్ష్మణ్, సుగుణ, నాయిని భాగ్య, మెడి సతీష్, వెంకటి, తొర్రెం వినోద్, నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బెజ్జూర్: ‘ప్రభుత్వ భూములు భద్రమేనా’ అనే శీర్షికన గత వారం రోజుల క్రితం ‘సాక్షి’లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రెవెన్యూ అధికారులు బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని వారసంత, బస్టాండ్ భూములను సర్వేయర్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్‌లు పరిశీలించారు. సర్వే ద్వారా ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు సైతం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు.

డీలర్ల సదస్సు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేశవరావు

కాగజ్‌నగర్‌రూరల్: ఈనెల 24న నిర్వహించే రేషన్ డీలర్ల రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు, ప్రధాన కార్యదర్శి కోనేరు శేషగిరిరావు కోరారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లాస్థాయి రేషన్ డీలర్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని కమిషన్లతో డీలర్ వ్యవస్థను కొనసాగిస్తున్నామని, డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా.. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ రేషన్ షాపులో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పేదల కుటుంబాలకు అందేవిధంగా రేషన్ షాపులను మినీ షాపింగ్ మాల్‌లాగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జాడి ఆత్మారాం, నాయకులు శంకరయ్య, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, శ్రీనివాస్, కమలాకర్, తిరుపతి, శ్రీనివాస్, శంకరమ్మ, జానీబాయ్, కుందారపు గోపాల్, తిరుపతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానించిన గ్రామస్తులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని గుండి ప్రభుత్వ పాఠశాలను 9వ తరగతి నుంచి 10వ తరగతికి అప్‌గ్రేడ్ చేసిన సందర్భంగా బుధవారం గుండి గ్రామస్తులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్యాంరావు, దత్తు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్ బాబు, మాజీ ఎంపీటీసీ మల్లన్న, నాయకులు అబ్దుల్లా అసద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



పూజలు చేస్తున్న మేదర మహేంద్రులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్ సమీపంలో గల మేదర మహేంద్ర సమావేశ మందిరంలో బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కుల దైవం కేతేశ్వర స్వామి, కంకలమ్మను, వెదురు బొంగులకు పూజలు చేశారు. అనంతరం ముఖ్యఅతిథి మేదరి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి కిషన్ వెదురు దినోత్సవం, వెదరు ప్రాముఖ్యతను వివరించారు. మేదరులకు సబ్సిడీతో కూడిన రుణాలు, పనిముట్లు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఊరే దినేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరే గణేష్, సూర్య దశరథ్, పిల్లి భాగ్యలక్ష్మి, పిల్లి మహిపాల్, మాదస్తు అడెల్లు, పెండారి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘ ప్రధాన కార్యదర్శి రవీందర్, శంకర్‌లు మాట్లాడుతూ మేదరి కులస్తులు వెదురు ద్వారా వివిధ రకాల వస్తువులను తయారు చేసుకొని, వెదురుతో తయారు చేసిన పరికరాలను అమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. మహేంద్రలు సామాజికంగా ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వ ఉచితంగా వెదురును అందించాలన్నారు. కార్యక్రమంలో మహేశ్, రవి, నర్సయ్య, తిరుపతి, సురేశ్, దినేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్ రూరల్: మేదరి సంఘం నాయకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ వెదురు దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే హరీశ్‌బాబును మేదరి సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మేదరి సంఘం నాయకులు మాట్లాడుతూ.. అటవీ ప్రాంతంలో వెదురును సేకరించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుల్వ కనకయ్య, సత్తయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలు సీజ్

రెబ్బెన: మండలంలో అక్రమంగా నిల్వ ఉంచి 94 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు మైనింగ్ శాఖ ఏడీ గంగాధర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖల ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు చేశామన్నారు. గోలేటి ఎక్స్‌రోడ్ సమీపంలో 14 ట్రాక్టర్ల ఇసుక, దేవులగూడ వద్ద 80 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిల్వలు సీజ్ చేశామని, త్వరలోనే వేలం వేస్తామని తెలిపారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి



మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో దత్తారావు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి బానోతు దత్తారావు అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం భీంపూర్, అర్లి(టి) సెక్టార్‌లకు సంబంధించి అంగన్‌వాడీ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ బరువు ఉన్న ఏడు గురు చిన్నారులను రిమ్స్ ఎన్‌ఆర్‌సీకి రిఫర్ చేశారు.

అసంపూర్తి వంతెనతో ఇక్కట్లు



నీటి మడుగు వద్ద వాగు దాటుతున్న ప్రజలు



అసంపూర్తిగా వంతెన

చింతలమానెపల్లి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రవాణా సౌకర్యాలు మెరుగుపడాలి. కానీ నేటికీ అనేక ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మండలంలోని నాయకపుగూడ గ్రామస్తులు గ్రా మం దాటి బయటకు రావాలంటే వాగు దాటి రావాల్సి ఉంటుంది. కానీ మధ్యలో ప్రవహించే వాగు వర్షాలు కురిస్తే ఉధృతితో ప్రవహిస్తాయి. గత ఐదు సంవత్సరాల క్రితం ఈ వాగుపై వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కాని అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. దీంతో గ్రామస్తులు వాగును ప్రమాదకరంగా దాటాల్సి వస్తోంది. చుట్టూ నీటి మడుగులు మధ్యలో పైపు లైన్ల కోసం వేసిన నిర్మాణంపై నుంచి నడుచుకుంటూ వాగు దాటుతున్నారు. అసంపూర్తి నిర్మించిన వంతెనను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మాణానికి కృషి

- ఎమ్మెల్సీ దండె విఠల్



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్–నాయకపుగూడ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని బాబాసాగర్ వద్ద వాగుపై అసంపూర్తిగా ఉన్న వంతెనను పరిశీలించారు. ఈసందర్భంగా స్థానికులు వాగుపై వంతెన లేక పోవడంతో పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలోనే వంతెన నిర్మాణానికి నిధులు విడుదల అయ్యేలా చూస్తానని అన్నారు. గతంలో నిధులు విడుదల కాకపోవడంతో వంతెన నిర్మాణం పూర్తి కాలేదన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాటు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండ్ర జగ్గాగౌడ్, ఉమా మహేశ్, దుబ్బుల నానయ్య, కుర్సింగ ఓం ప్రకాశ్, సదాశివ్, నాహిర్ అలీ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: గిరి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం మండలంలోని కమ్మర్‌గాం, గుండెపల్లి గ్రామాల్లో పర్యటించారు. ప్రభుత్వం మారుమూల గ్రామాలకు రోడ్డు, రవాణా వ్యవస్థలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో గ్రామానికి పక్కా రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. బెజ్జూర్ నుంచి నందిగామ వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ. 10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు హర్షద్, మాజీ జెడ్పీ చైర్మన్ గణపతి, జగ్గాగౌడ్, వంద్రం పుష్పలత, మధునయ్య, బాపు, ప్రభాకర్, కృష్ణ, చంద్రమౌళి పాల్గొన్నారు

టీకాల ఆవశ్యకతపై అవగాహన



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

వాంకిడి: మండలంలోని ధాబా, బండకాస గ్రామాల్లోని గర్భిణులకు, బాలింతలకు బుధవారం టీకాల ఆవశ్యకతపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. సరైన సమయంలో క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే గర్భిణులు కాన్పుకు వారం రోజుల ముందే ఆసుపత్రిలో చేరాలని, అప్పుడే తల్లీ, బిడ్డా క్షేమంగా ఉంటారని అన్నారు. అనంతరం గ్రామంలో డ్రైడే నిర్వహించి, దోమల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, ఏఎన్ఎం గోదావరి, ఆశలు బాగుబాయి, ఈశ్వరి, బ్రీడింగ్ చెక్కర్ దిలీప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘అక్రమ కట్టడాలు తొలగించాలి’



విచారణ చేపడుతున్న ఎంపీడీవో, ఆర్ఐ

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ ఆనుకొని నిర్మించిన అక్రమ కట్టడాలను వారం లోగా తొలగించాలని ఎంపీడీవో రాజేందర్, ఆర్ఐ నాందేవ్‌లు అన్నారు. ప్రహరీకి ఆనుకొని పలువురు అక్రమంగా టీలాలు ఏర్పాటు చేయడంతో జిల్లా కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం విచారణ చేపట్టామని ఎంపీడీవో పేర్కొన్నారు. నివేదికను జిల్లా అధికారులకు పంపిస్తామన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెంచికల్‌పేట్: స్వచ్ఛత హే సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎల్కపల్లి, సంజీవనగర్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపైన అవగాహన కల్పించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అర్షియా, ప్రియాంక, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో పోలీసులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మీదుగా మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో కౌటాల మండలం బోదంపల్లి గ్రామానికి చెందిన అక్కెపల్లి నామ్‌దేవ్, సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన పూల్జలే తిరుపతిలు బైక్‌పై 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఆర్ఐలు లావుడె గోపాల్, ఎల్ మోహన్‌లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వేముల మల్లేశ్

తిర్యాణి: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో వేముల మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత.. పచ్చదానంపై జెడ్పీ పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్ రెడ్డి, ఏపీవో షాకీర్ ఉస్మానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా దివ్యాంగుల మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని జిల్లా దివ్యాంగుల సమైఖ్య అధ్యక్షుడు ఇస్లాం బిన్ అహ్మద్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న సినియా థియేటర్‌లో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలన్నారు. దివ్యాంగుల చట్టం 2016 సెక్షన్ 8 ప్రకారం రాష్ట్రంలో దివ్యాంగుల మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసిశారని, జిల్లాలో మాత్రం మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. జిల్లాలో దివ్యాంగుల సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మహిళా క్యాంటిన్‌లో దివ్యాంగులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజయ్య, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.